క్లుప్తంగా

మరిడమ్మకు సారె సమర్పణ



ఏలేశ్వరంలో అమ్మవారికి సారె, పిండివంటలు సమర్పిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గ్రామదేవత మరిడమ్మ అమ్మవారికి మంగళవారం ఘనంగా సారె సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, చీరతో పాటు 54 రకాల పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. తొలుత స్థానిక పాతబస్టాండ్ వినాయకుడి ఆలయం నుంచి మెయిన్‌రోడ్ మీదుగా అమ్మవారి ఆలయం వరకూ సారెతో ఊరేగించారు. పట్టణానికి చెందిన పలు భజనబృందాల సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద హనుమాన్ చాలీసా, పారాయణం చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి కటకం కిరిటీ, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు, నడిశెట్టి తిరుపతిరావు, గట్టెం వెంకటరమణ, ఇందిరాదేవి, ఎం.సూర్యాకుమారి, పి.లలిత పాల్గొన్నారు.

నేడు తంటికొండ వెంకన్న హుండీ లెక్కింపు

గోకవరం: తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించనున్నారు. ఈ విషయన్ని దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వి.సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు దేవదాయశాఖ అధికారులు, గ్రామస్తులు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారుల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కిస్తారన్నారు.

ఆయకట్టుకు సాగునీరు



పెద్దనాపల్లిలో పుష్కర లిఫ్టును ప్రారంభిస్తున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం: ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. పెద్దనాపల్లి గ్రామంలో మంగళవారం ఆయన పుష్కర లిఫ్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు పుష్కర ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు లిఫ్ట్ ప్రారంభించామన్నారు. రైతులకు సాగునీరు అందుతుందన్నారు. జేఈ రజనీకాంత్, సర్పంచ్ బుద్దా సూర్యప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.150 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేయనున్నట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేటలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.2వేల కోట్లు వినియోగించుకోకుండా ఉన్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి గుర్తించారని, వీటిలో రూ.150 కోట్లు జగ్గంపేట నియోజకవర్గానికి మంజూరు చేయిస్తున్నట్టు తెలిపారు. 2024 సంవత్సరం పూర్తయ్యేలోపు ఈ నిధులతో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు

అన్నవరం: ఆషాడ మాసంలో వచ్చే వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి జన్మ నక్షత్రం ఆడి కృత్తిక సందర్భంగా మంగళవారం స్థానిక దేవస్థానం హైస్కూల్ వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరుని గుడిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు 108 కలశాలతో తెచ్చిన పుణ్యజలాలు, పంచామృతాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

తొండంగి: మండలంలోని దానవాయిపేటలో మంగళవారం ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తొండంగి గ్రామానికి చెందిన గునిశెట్టి నరసింహారావు(50) కొబ్బరి బొండాల ట్రాక్టర్‌పై తొండంగి నుంచి తుని వెళ్తుండగా దానవాయిపేట బీచ్‌రోడ్డుపై ప్రమాదవశాత్తు జారి ట్రాక్టర్ కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై తొండంగి ఎస్సై బి.వినయ్‌ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంలో నరసింహారావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

నత్తనడకన పనులు

- అరకొరగా కాలువల్లో పూడికతీత
- కొత్త ప్రభుత్వంలో ఎదురవుతున్న ఇబ్బందులు, వర్షాల కారణంగా ఆలస్యం
- వర్షం వస్తే రోడ్లు జలమయం
- ఆరు కిలోమీటర్లకు రూ.40 లక్షల మంజూరు

తుని: పట్టణంలో మురుగుకాలువల్లో పూడికతీత పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులు మంజూరు చేసినా వర్షాల కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయి. సరైన అవుట్ లేట్ లేకపోవడంతో ఏటా పలు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. ప్రతి సంవత్సరం వర్షా కాలంలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇందుకు ప్రధాన కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో నీటి పారుదలకు ఇబ్బందులు నెలకొంటున్నాయి. మున్సిపాలిటీలో గత ప్రభుత్వం అన్ని విషయాల్లోనూ జాగ్రత్తలను తీసుకుంది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కౌన్సిల్ పాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్నికల కోడ్ వల్ల ఈ ఏడాది పూడిక తీత పనులు ఆలస్యమయ్యాయి. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో పూడికతీత పనులకు అవసరమైన నిధులను మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన తక్కువ వ్యవధిలోనే వర్షాలు కురవడంతో నత్తనడకన పనులు జరుగుతున్నాయి.



తునిలో ప్రధాన కాలువలో పూడిక తీసిన దృశ్యం



ప్రకాశం రోడ్డులో పూడిక పనుల్లో ఉన్న కార్మికులు

ఇదీ పరిస్థితి

పట్టణంలో ఉన్న కాలువల్లో ప్రధానమైనవి 6 కిలోమీటర్లు ఉన్నాయి. వీటిలో పూడిక తీయడానికి ఇంజినీరింగ్ శాఖ తయారు చేసిన అంచనాల ప్రకారం రూ.40 లక్షలు మంజూరు చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో కాంట్రాక్టరుకు అప్పగించారు. తక్కువ వ్యవధిలో మొత్తం పనిని పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధికారులను ఆదేశించారు. పెద్దపాటి వర్షాలు వచ్చిన ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలనే ఉద్దేశంతో పాలకవర్గం ఇందుకు అనుగుణంగానే పనులు వేగంగా చేస్తోంది.

పూడిక తీసే కాలువలు

జాతీయ రహదారిని ఆనుకుని కొండవారిపేట రైల్వే అండర్ పాస్ వరకూ, సినిమారోడ్డు నుంచి పాతబజారువీధి వేంకటేశ్వరస్వామి గుడి వరకూ ఎక్కువ దూరం ఉంది. ఇవే ప్రధాన కాలువలుగా ఉన్నాయి. పట్టణంలో వచ్చే 75 శాతం నీరు వీటి ద్వారా వెళుతుంది. దీంతో పాటు సీతారాంపురం, అమ్మాజీపేట, సూరవరం రోడ్డు, మార్కండ్రాజుపేట కాలువలు ఉన్నాయి. వచ్చే నెల 10 లోగా పూడిక తీత పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి, కమిషనర్ వెంకట్రావు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ప్రజలకు ఇబ్బంది ఉండదు

టీడీపీ ప్రభుత్వ హయాంలో వర్షాకాలం వస్తే చాలు చాలా ప్రాంతాలు నీటి మునిగాయి. ఇందుకు ప్రధాన కారణం సకాలంలో పూడిక తీత పనులు చేపట్టక పోవడం. అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే పూడిక తీతపై దృష్టి సారించాం. సత్వరమే నిధులు మంజూరు చేశాం. పూడిక తీత పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం.

– ఏలూరి సుధారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్, తుని

నిత్యం పర్యవేక్షణ

పట్టణంలో రూ.40 లక్షలతో చేపట్టిన 6 కిలోమీటర్ల కాలువల్లో పూడిక పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. పనుల పర్యవేక్షణ బాధ్యతను డీఈఈ ప్రకాశరావు, శానటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌లకు అప్పగించాం. కాలువల్లో తీసిన పూడికను ఆరిన వెంటనే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాం. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాం.

– వెంకట్రావు, కమిషనర్, తుని


3న దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

జగ్గంపేట: నియోజకవర్గంలోని దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు మంజూరు చేసేందుకు కలెక్టర్ ఆదేశాలతో వచ్చే నెల 3వ తేదీన జగ్గంపేటలో గుర్తింపు శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ ఈ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.అప్పన్నదొర తెలిపారు. దివ్యాంగులను ఈ శిబిరంలో పరీక్షించి వారికి అవసరమైన ఉపకరణాలు గుర్తించి నమోదు చేసుకుంటారని చెప్పారు. వాటిని తయారు అందిస్తారన్నారు. ఈ శిబిరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందన్నారు. గుర్తింపు కార్డులు తీసుకురావాలని తెలిపారు.

6న తునిలో..

తుని రూరల్: వచ్చే నెల ఆరో తేదీన దివ్యాంగులు, వయో వృద్ధులకు అవసరమైన పరికరాల పంపిణీ చేసేందుకు గుర్తింపు శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఆరోజు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటలు వరకు తుని మున్సిపల్ కార్యాలయంలో గుర్తింపు శిబిరం నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగి ఈ శిబిరాన్ని తుని, కోటనందూరు, తొండంగి, తుని పట్టణానికి చెందిన అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో పరికరాలు అందించేందుకేనని, ఏవిధమైన సర్టిఫికెట్లు, ఇతరేతర ఏ పథకాలకు వర్తించవన్నారు.

మెట్టలో మొదలైన ఖరీఫ్ వరినాట్లు



డి.పోలవరంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

తుని రూరల్: మెట్ట ప్రాంతంలో శివారు మండలమైన తుని మండలంలో ఎట్టకేలకు ఖరీఫ్ వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఇటీవల వారం రోజులు కురిసిన వర్షపునీరు, విద్యుత్ బోరుబావుల నీటి వనరులు అందుబాటులో ఉండడంతో రైతులు వరినాట్లు చేపట్టారు. సాధారణంగా ఖరీఫ్ వరినాట్లు జూన్, జూలైలలో పూర్తి కావాలి. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, భారీ వర్షాలు కురవకపోవడం, ప్రాజెక్టుల నుంచి సాగునీరు విడుదల చేయకపోవడంతో నాట్లు పడలేదు. ఇటీవల కురిసి వర్షాలతో సాగునీటి చెరువుల్లో నీటి నిల్వలు చేరడం, తాండవ నదీ జలాలు డి.పోలవరం, ఎస్.సూరవరం, ఎన్.ఎస్.వి.నగరం, పుష్కర కాలువ నుంచి ఎస్.అన్నవరం, టి.తిమ్మాపురం, టి.వెంకటాపురం, హంసవరం తదితర గ్రామాల పరిధిలో చెరువులకు చేరుతున్నాయి. దీంతో కొంతమంది రైతులు దంపాకు, నారుమళ్లు వేశారు. డి.పోలవరం, సుభద్రయ్యమ్మపేట, ఎస్.సూరవరంలో రైతులు బోరుబావుల కింద వేసిన నారు అందివచ్చింది. దీంతో ఆలస్యంగా ఖరీఫ్ నాట్లు వేస్తున్నారు. ఇప్పటికే పంపా రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయగా ఆగస్టు 15కి తాండవ రిజర్వాయర్ నుంచి సాగునీరు విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 380 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల తాండవలో ప్రస్తుతం 372.34 అడుగులు, 105 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న పంపాలో 99.48 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల నుంచి సాగునీరు అందుతుందన్న నమ్మకంతో నాట్లు వేస్తున్నట్టు డి.పోలవరం, ఎస్‌బీ.పేట, ఎస్.సూరవరం రైతులు తెలిపారు. ఆగస్టు రెండో వారం నుంచి ముమ్మరమై ఆఖరి వారానికి వరి నాట్లు పూర్తవుతాయని ఏఓ అశోక్ కుమార్ తెలిపారు.

నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలు అరికడదాం..



సదస్సులోమాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భాను

ఏలేశ్వరం: నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు అరికడదామని ప్రత్తిపాడు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కాటం భాను అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసు కమిటీ ఆధ్వర్యంలో యర్రవరంలోని శ్రీసూర్యా జూనియర్ కళాశాలలో మంగళవారం డ్రగ్స్, రోడ్డు ప్రమాదాల నివారణపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండడంతో పాటు హెల్మెట్ ఉపయోగించాలన్నారు. పోలీసులు కేసులు నమోదు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులు శిక్షార్హులవుతారన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బుగతా శివ, అవసరాల దేవి, బి.మధు, ప్రిన్సిపాల్ శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

తొండంగి: రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులంతా ర్యాలీగా పెరుమాళ్లపురం మెయిన్ సెంటర్ వరకూ ప్లకార్డులు, బ్యానర్‌లతో అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, వాహనాల వేగాన్ని తగ్గించుకుని సురక్షిత ప్రయాణాలు సాగించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెహర్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

నేహశ్రీకి అభినందనలు



ఏలేశ్వరంలో నేహశ్రీకి షీల్డ్, ప్రశంసాపత్రం అందజేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఏలేశ్వరం: ఇటీవల నిర్వహించిన గోదావరి తెలుగు టాలెంట్ టెస్టులో రాష్ట్ర రెండో ర్యాంక్ సాధించిన ఎస్.నేహశ్రీకు పట్టణంలో మంగళవారం షీల్డ్ ప్రశంసపత్రం అందజేశారు. పడాల చారిటబుల్‌ట్రస్టు, తానా ఫౌండేషన్ వారధి ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన టెస్టులో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నేహశ్రీ పాల్గొని ర్యాంక్ సాధించింది. దీంతో పాఠశాల ఆవరణలో హెచ్ఎం లక్ష్మీతులసి ఆధ్వర్యంలో నేహశ్రీకి షీల్డ్ ప్రశంస పత్రం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి నారు శుద్ధితో తెగుళ్లు దూరం



ఎస్‌బీ పేటలో వరినారు శుద్ధి చేయడాన్ని రైతులకు వివరిస్తున్న ఏఓ అశోక్ కుమార్

తుని రూరల్: ఖరీఫ్ వరిసాగులో సుడోమోనాస్ జీవనాశినితో వరినారు శుద్ధి చేయడం ఎంతో కీలకమని, తెగుళ్ల నుంచి రక్షణ ఉంటుందని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం తుని మండలం సుభద్రయ్యమ్మపేట (ఎస్‌బీ.పేట)లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరినారును సంరక్షించేందుకు సడోమోనాస్ జీవనాశినితో ఏవిధంగా శుద్ధి చేయాలని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. మూడు అడుగుల వెడల్పు, మూడు అడుగుల పొడవు ఉన్న విస్తీర్ణాన్ని ఎంపిక చేసుకుని పళ్లెంలా తయారు చేసుకోవాలన్నారు. అందులో ఎకరానికి కిలో సుడోమోనాస్ మందును కలపాలన్నారు. నాట్లు వేసే ముందు వరినారు కట్టలను 20 నిమిషాలు ఉంచాలన్నారు. దీనివల్ల నేల, గాలి, నారు ద్వారా వచ్చే తెగుళ్ల నివారించుకోవచ్చన్నారు. రైతులు ఇటువంటి సూచనలు పాటిస్తే తెగుళ్ల నివారించి, ఎరువులు, పురుగు మందుల వినియోగం, పెట్టుబడి తగ్గుతాయన్నారు. వీఏఏలు లోవరాజు, శ్రీను, శివాజీ, బి.శ్రీను, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

లింగాకర్షణ బుట్టలతో గులాబీ పురుగుల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అశోక్‌కుమార్

తుని రూరల్: పత్తిలో లింగాకర్షణ బుట్టలతో గులాబీ పురుగులను నివారించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం తుని మండలం ఎన్.చామవరం, ఎస్.అన్నవరం తదితర గ్రామాల పరిధిలో పర్యటించిన ఆయన పత్తి పైర్లను పరిశీలించారు. గులాబీ పురుగులు ఆశించడంతో పత్తికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఏఓ రైతులకు తెలిపారు. గులాబీ రంగు పురుగులను నివారించేందుకు సులభమైన మార్గం లింగాకర్షణ బుట్టలన్నారు. ఎకరానికి ఎనిమిది బుట్టలు ఏర్పాటు చేసుకుంటే అందులో ఉండే మందు 45 రోజులు పని చేస్తుందన్నారు. అవసరమైతే 45 రోజుల తర్వాత బుట్టు అలాగే ఉంచి మందును మళ్లీ ఏర్పాటు చేసుకుంటే గులాబీ పురుగుల ఉధృతి తగ్గుతుందన్నారు. ఎలా ఏర్పాటు చేయాలో రైతులకు వివరించారు. వీటి వల్ల రైతులకు ఆరోగ్యంపై ఎటువంటి చెడు ప్రభావం ఉండదన్నారు. ప్రత్యామ్నాయంగా పురుగులు మందులు వాడితే రూ.నాలుగైదు వేలు ఖర్చవుతుందని, పత్తిపైరులో సంచరించే రైతులకు అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఏఈఓ పి.జగ్గఅప్పారావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సూక్ష్మ రుణాలతో మహిళల ఆర్థికాభివృద్ధి



ఉపాధిపై అవగాహన కల్పిస్తున్న పూర్ణిమ

జగ్గంపేట: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మిషన్ శక్తి పథకంలో అందించే సూక్ష్మ రుణాలు ఎంతో ఉపయోగపడతాయని ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ అన్నారు జె.కొత్తూరు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం మిషన్ శక్తి పథకం, ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆమె మాట్లాడుతూ మహిళలకు అన్ని విధాల రక్షణగా ఉండేందుకు మిషన్ శక్తి పథకాన్ని కేంద్రం ఏర్పాటు చేసిందని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు విద్య, పరిశుభ్రత, ఆహారం,ఆరోగ్యం తదితర అంశాలలో ఎలాంటి శిక్షణ, అవగాహన, కల్పిస్తారో తల్లులకు వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ అమ్మాజీ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడి సిబ్బంది, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



ములగపూడిలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి: ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం పాఠ్యపుస్తకాలను అందజేశారు. ప్రభుత్వంఏర్పాటు చేసిన ఈ పాఠ్యపుస్తకాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేతుల మీదగా అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సర్పంచ్ తమరాన సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు యామల సురేష్, టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థుల ఉన్నత స్థాయి

శంఖవరం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల్లో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణ మిత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈఓ ఎస్‌పీ రమణ,ఎన్‌డీఏ కార్యకర్తలు పర్వత సురేష్,బద్ది రామారావు,వెన్నా శివ, కొండమూరి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



ములగపూడి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పద్మావతి

రౌతులపూడి: గ్రామాల్లోని బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీడీఆర్ పద్మావతి అన్నారు. బాలల హక్కులు, చట్టాలపై(బేటీ బచావో, బేటీ పడావో) కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ములగపూడి, బలరామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు గురించి అందరూ గమనించాలన్నారు. చిన్నతనంలో వివాహం చేయడం వల్ల ఎన్నో సమస్యలు వస్తాయని తెలిపారు. బాలల హక్కులు పరిరక్షణ, సంరక్షణలో తల్లిదండ్రులతోబాటు ప్రజలంతా బాధ్యతగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల విస్తరణాధికారిణి పి.జానకీలక్ష్మి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాగి నారుమళ్ల తయారీలో జాగ్రత్తలు



ఎస్.జగ్గంపేటలో రాగి నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: రాగి పంట కోసం నారు మళ్ల తయారీలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. మంగళవారం ఎస్.జగ్గంపేటలో రాగి పంట కోసం రైతులు తయారు చేసిన నారుమడిని పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను బీజామృతంలో విత్తనశుద్ధి చేసిన తరువాత 5 సెంట్ల నారుమడిలో 2 కిలోల విత్తనాలను జల్లుకోవాలన్నారు. నారుమడిలో నీటి సౌకర్యం ఉండేలా చూసుకోవాలన్నారు. విత్తనాలు మొలకు వచ్చే వరకూ నారుమడిపై ఎండు గడ్డి కప్పి నీరు చిలకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు క్రాంతి పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు రాగి విత్తనాలు

గండేపల్లి: ప్రభుత్వం రైతులు 50 శాతం రాయితీపై రాగులు అందజేస్తున్నట్టు ఏఓ సద్గురుమూర్తి తెలిపారు. తాళ్లూరులో మంగళవారం రైతులకు రాగి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఈ విత్తనాలు అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలామంతుల వీరబాబు, ఉప సర్పంచ్ పైయిణ్ని వెంకటేశ్వరరావు, కొండ్రు అప్పలరాజు, విఏఏ ప్రుధ్వి, రాఘవ, రైతులు పాల్గొన్నారు.

చారుమజుందార్‌కు నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న బుగతా బంగారావు

కోటనందూరు: కేఈ చిన్నయ్యపాలెంలో సీపీఐ(ఎంఎల్) వ్యవస్థాపకుడు చారుమజుందార్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు బుగతా బంగారావు చారుమజుందార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేదల రాజ్యాధికారం, అభ్యున్నతికి చారుమజుందార్ చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడు కే జనార్ధన్, దడాల లోవరాజు, చేదులూరి తాతారావు, పైపా పర్సయ్య, ముప్పం నూకరాజు, గంటా ముత్యాలు, దారకొండ శీలుపతి పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసైతే జీవితం నాశనం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కోటేశ్వరరావు, శేషారెడ్డి

తుని: యువత వ్యసనాలకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె.బాల కోటేశ్వరరావు సూచించారు. మంగళవారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథి న్యాయమూర్తి బాల కోటేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో యువత మత్తుకు అలవాటు పడ్డారని, గంజాయి కేసులు ఎక్కువ నమోదయ్యాయన్నారు. కళాశాలలకు వెళుతున్న విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి కోరారు. ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్‌ను బంగారు బాట చేసుకోవాలన్నారు. విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్ణయించుకుని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలుగు కృష్ణశేఖర్, పీఈ భరద్వాజ్, ఎ.నరసింహామూర్తి, బి.ఉమా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాలకావెళ్ల మహోత్సవం



పాలకావెళ్ల మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: శరభవరంలో స్వయంభూ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో మంగళవారం పాలకావెళ్లతో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శాంతి హోమాలు నిర్వహించారు. ఈ స్వయంభూ క్షేత్రంలో సంతానం లేని వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరభవరం, గజ్జనపూడి, కొత్తూరు గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి స్వామిఅమ్మ వార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నీటి వృథాను అరికడదాం

గండేపల్లి: నీటి వృథాను అరికట్టడం మనందరి బాధ్యతని ఆదిత్య యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవిశంకర్ పేర్కొన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో నేచర్ క్లిక్ అనే పోటీని నిర్వహించారు. నేచర్ క్లిక్ పోటీలు నిర్వహించి, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పీ వైదేహి, ఎస్ తిరుమలదేవి, కే జ్ఞానేశ్వరి, ఎన్ దివ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.